APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ మంగళవారం 07, జూలై 2026 సంపుటి: 01 సంచిక :41 పేజీలు : 04 వెల: 2-00/-



## కశ్మీర్‌ను వణికించిన భారీ వర్షాలు

- కొండచరియలు విరిగి భారీ నష్టం
- జలవిద్యుత్ ప్రాజెక్టులో చిక్కుకున్న వాహనాలు
- సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, సైన్యం

శ్రీనగర్, జులై 6 : జమ్మూకశ్మీర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు సోమవారం తీవ్ర బీభత్సం సృష్టించాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడగా, కిశ్త్వాడ్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే రహదారిపై భారీగా బురద, బండరాళ్లు పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో ట్రక్కులు, మిల్లులు, ఇతర భారీ యంత్రాలు బురదలో కూరుకుపోయాయి. మరికొన్ని వాహనాలు భారీ రాళ్ల కింద చిక్కుకుపోయాయి. నిర్మాణానికి సంబంధించిన పరికరాలు, సామగ్రి కూడా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు.

సమాచారం అందుకున్న వెంటనే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత సైన్యం, స్థానిక రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వాహనాలను వెలికితీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగుతున్నాయి. ఆకస్మిక వరదలతో భారీ మొత్తంలో బురద, బండరాళ్లు ప్రాజెక్టు ప్రాంతంలోకి చేరాయని అధికారులు తెలిపారు. దీంతో నిర్మాణ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, నష్టం అంచనా వేసే పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రజల భద్రత దృష్ట్యా కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద ప్రభావిత ప్రాంతాలకు ప్రజలు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు.

## రియల్‌టైమ్ పాలనకు సీఎం దిశానిర్దేశం

- ఫిర్యాదులపై తక్షణ స్పందన
- పీజీఆర్ఎస్‌కు ప్రత్యేక కార్యాచరణ
- గంజాయి నిర్మూలన, జీరో వేస్ట్‌పై దృష్టి




అమరావతి, జులై 6 : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై రియల్‌టైమ్‌లోనే స్పందిస్తూ ప్రభుత్వ సేవల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. ఐదు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని అమరావతికి చేరుకున్న ఆయన సోమవారం సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ శాఖల పనితీరు, ప్రజా సేవల నాణ్యతపై విస్తృతంగా చర్చించారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రం ద్వారా ప్రజలకు 24 గంటలూ వేగవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. విశాఖ సముద్ర తీరంలో బోటు ప్రమాదం సమయంలో ప్రభుత్వ శాఖలు సమన్వయంతో స్పందించిన తీరును ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ప్రతి అత్యవసర పరిస్థితిలో ఇదే తరహా స్పందన ఉండాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో వివిధ శాఖల మధ్య సమన్వయ సమావేశాలను తరచూ నిర్వహించాలని పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని చంద్రబాబు ఆదేశించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాల వారీగా ఫిర్యాదులను విభజించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, కలెక్టర్లు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యత తీసుకుని ఫలితాలు చూపాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో పేరుకుపోయిన 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లో తొలగించాలని సీఎం అధికారులకు నిర్దేశించారు. 'జీరో వేస్ట్' లక్ష్యంతో ముందుకు సాగాలని, ఇంటింటికీ చెత్త సేకరణ, స్వచ్ఛ రథాల నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.

రాష్ట్రంలో గంజాయి ముఠాలపై కఠిన చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని హోం శాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, మహిళలపై నేరాలను తగ్గించేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటును వేగవంతం చేయడంతో పాటు, మారుమూల ప్రాంతాల్లో కమ్యూనికేషన్ సౌకర్యాలు మెరుగుపరిచేందుకు టెలికాం సంస్థలతో సమన్వయం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సేవల ఫలితాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జవాబుదారీతనంతో కూడిన పాలన అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## వెంకయ్య నాయుడు సేవలు

### యువతకు ఆదర్శం: మంత్రి నారాయణ

నెల్లూరు, జులై 6 : భారత మాజీ ఉపరాష్ట్రపతి, మాజీ కేంద్ర మంత్రి ఎం. వెంకయ్య నాయుడు ప్రజా జీవితంలో చూపిన సేవలు, విలువలకు కట్టుబడి పనిచేసిన తీరు భావితరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరులో నిర్వహించిన 'వెంకయ్య నాయకుడు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వెంకయ్య నాయుడు దేశ రాజకీయాల్లో ఆదర్శ నాయకుడిగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, క్రమశిక్షణ, అంకితభావం, ప్రజాసేవకు వెంకయ్య నాయుడు ప్రతీకగా నిలిచారని అన్నారు. ఉన్నత పదవులు చేపట్టినా విలువలను విడిచిపెట్టకుండా ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు.

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం




అమరావతి, జులై 6 : రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత, సురక్షిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సోమవారం డీజీపీతో పాటు పోలీసు ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని పోలీసు రేంజ్‌లు, ప్రత్యేక విభాగాల పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గంజాయి సాగు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని పోలీసు అధికారులకు మంత్రి ఆదేశించారు. డ్రగ్స్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకుని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, 'శక్తి' బృందాలను మరింత బలోపేతం చేసి మహిళలపై జరిగే నేరాలను సమర్థవంతంగా అరికట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాన్ని కట్టడి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అన్నారు. తప్పుడు ప్రచారం, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూనే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ప్రజాకేంద్రిత పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అనిత స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పోలీసు సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

## శ్యామా ప్రసాద్‌కు ఘన నివాళి



ధర్మవరం, జులై 6 : భారతీయ జనతా పార్టీ సిద్ధాంత రూపకర్తల్లో ఒకరైన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ధర్మవరం పట్టణంలోని 170వ బూత్ పరిధిలో పార్టీ కార్యకర్తలతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మహనీయుడి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అఖండ భారత నిర్మాణం కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప జాతీయవాద నాయకుడని కొనియాడారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదు" అనే డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సంకల్పం దేశ సమైక్యతకు మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి అన్నారు. జమ్మూ కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా ఉండాలనే లక్ష్యంతో ఆయన చేసిన పోరాటం దేశభక్తికి నిదర్శనమని తెలిపారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ ప్రయోజనాలనే అత్యున్నతంగా భావించి పనిచేశారని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజాసేవ, జాతీయవాదం, దేశ సమగ్రత కోసం ఆయన అవలంబించిన సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దేశభక్తి, సేవాభావం, జాతీయ సమైక్యత కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చూపిన మార్గంలో నడవాలని మంత్రి పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాల సాధనకు అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## జిల్లా పోలీసులకు పదోన్నతులు..



అనంత క్రైమ్ జులై 6( అనంత సూర్య) : జిల్లాలో సివిల్ పోలీస్ విభాగంలో పనిచేస్తున్నటువంటి 15 మంది సిబ్బందికి పదోన్నతులు లభించాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సిబ్బందికి పదోన్నతి లభించడంతో ఉన్నతాధికారులకు అభినందనలు తెలియజేశారు. 1995 బ్యాచ్ కు చెందినటువంటి 15 మందికి ఈ సందర్భంగా ఏ ఎస్ ఐ లు గా పదోన్నతులు లభించాయి. రాష్ట్ర డిజిపి గతవారం పదో న్నతులకు సంబంధించినటువంటి దస్త్రంపై సంతకం చేసి ఆయా జిల్లా ఎస్పీ లకి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 15మంది కి పదోన్నతులు లభించాయి. వీరిలో పుట్టపర్తి జిల్లాకు 7 మందికి పదోన్నతులు లభించగా మిగతా సిబ్బందికి అనంతపురం జిల్లాకి కేటాయించారు. వీరు గతంలో ఆయ స్టేషన్లలో జశీదారులుగా పనిచేసే వారు. ఇందులో వి. వెంకటేశులును నగరం లోని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ కు, ఏ. షేక్షవాలి ని గుంతకల్ 2వ పట్టణ పోలీస్ స్టేషన్ కు కేటాయిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఏ ఎస్ ఐ లుగా ఆయా స్టేషన్లో విధుల్లో చేరారు. నేడు జిల్లా పోలీస్ కార్యాలయం లో జిల్లా ఎస్పీ ని కలసి అభినందనలు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో పలువురు జిల్లా పోలీస్ అధికారులు, జిల్లా పోలీస్ సంక్షేమ సంగం కార్యదర్శి త్రిలోక్ లు పాల్గొన్నారు.

## 116 ఏళ్ల వృద్ధ భక్తురాలు శ్రీమతి నవనీతమ్మ కు తిరుమల శ్రీ వారి సన్నిధికి విఐపీ బ్రేక్ దర్శనం



తిరుపతి, జూలై 06 (అనంత సూర్య) 116 ఏళ్ల వృద్ధురాలు శ్రీమతి నవనీతమ్మ కు తన కుటుంబ సభ్యులతోపాటు విఐపి లాంచనాలతో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం చేయించారు. టీటీడీ అధికారులు సిఈఒ ముద్దాడ రవిచంద్ర స్వయంగా వృద్ధురాలి తోపాటు కుటుంబసభ్యులను అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నవనీతమ్మ మనవడు దిక్పతీ మాట్లాడుతూ అమ్మమ్మ కోరికను నెరవేర్చి తమ కుటుంబ సభ్యులందరికీ శ్రీవారి దర్శన భాగ్యం కల్పించిన టీటీడీకి హృదయపూర్వక ధన్యవాదాలు  అని తెలిపారు. ఈ నేపథ్యంలో నవనీతమ్మను గుర్తించడంలో తమ వంతు సహకారం అందించిన సోషల్ మీడియా మిత్రులకు టీటీడీ విజిలెన్స్ అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఒక భక్తురాలి జీవితకాల కోరిక నెరవేరిన ఈ సందర్భం మా అందరికీ ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని కలిగించిందని సాటి భక్తులు, తిరుపతి తిరుమల దేవస్థాన సిబ్బంది తదితరులు వృద్ధురాలికి అభినందనలు తెలిపారు.

## ఏపీలో జూలై 8 నుండి సదరం క్యాంప్ మంత్రి సత్యకుమార్



అమరావతి  జులై 6 (అనంత సూర్య) : ఏపీలోని దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వం దరఖాస్తు ప్రక్రియను జూలై 8 నుంచి ఆగస్టు చివరి వరకు చేపడుతున్నట్లు సమాచారం. లబ్ధిదారులు మీ–సేవ, గ్రామ సచివాలయాల నుండి జోనల్ స్థాయిలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. జూలై 13 నుంచి ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించినట్లు సంబంధిత అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఏపీలో దివ్యాంగుల కోసం 'సదరం' సేవలలో కీలక సంస్కరణలు తెచ్చినట్లు తెలిపారు. జులై 13 నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. ప్రయాణ భారం తగ్గించేలా రాష్ట్రాన్ని 6 జోన్లుగా విభజించి సొంత జోన్లోనే పరీక్షల సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

# రాసాని రచనలు సామాజిక జీవితచిత్రణలు

# "స్వర్ణముఖి కథలు" పుస్తకావిష్కరణలో వక్తలు



అనంతపురం జూలై 6 అనంత సూర్య : ప్రముఖ కవి, కథకులు, నవలాకారుడు, నాటకకర్త డా. రాసాని వెంకట్రామయ్య రచనలు సామాజిక జీవిత చిత్రణలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాసాని రచించిన "స్వర్ణముఖి కథలు" పుస్తకావిష్కరణ సభ సోమవారం పౌర గ్రంథాలయ శాఖ, విమలాశాంతి సాహిత్య, సాంఘిక, సాంస్కృతిక సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సాగింది. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సమావేశ మందిరంలో జరిగిన సభకు ప్రముఖ సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ విసి ప్రొ. కుసుమకుమారి హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఆత్మీయ అతిథులుగా ప్రముఖ మార్క్సిస్ట్ విమర్శకులు భూమన్, ప్రముఖ రచయిత డాక్టర్ శాంతి నారాయణ హాజరయ్యారు. ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు తూముచర్ల రాజారామ్ విశిష్ట అతిథిగా హాజరై పుస్తక సమీక్ష చేశారు. ఏపీ గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ప్రముఖ కవి సాహిత్య విమర్శకులు కొత్వాలు అమరేంద్ర ఆప్తవాక్యం పలికారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, రాసాని పరిశోధనాత్మకంగా 'ఆదియోధుడు', 'వొలికెల బీడు', 'ముద్ర', 'బతుకాట', 'వలస', 'పరస' 'నరమేధం', 'నేలతీపి', 'తరిగొండ వెంగమాంబ', 'చెంచిత', 'మెరవణి', 'ముల్లు గర్ర', 'నాలుగో నాటకం', 'రక్త చందనం' వంటి అనేక కథలు, నవలలు, నాటకాలు వెలువరించారని చెప్పారు. ద్రవిడ సమాజపు లోతులకు వెళ్లి, పరిశోధనలు చేసి, తెలుగు సాహిత్యానికి గొప్ప నవలలు, , నాటకాలు, కథలను అందించిన రాసాని అభినందనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో జిరసం అధ్యక్షులు కొత్తపల్లి సురేష్, సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు, డాక్టర్ నానీల నాగేంద్ర, ఈ. కమలాకర్, షహనాజ్, తరిమెల అమరనాథ రెడ్డి,  డా. మల్లికార్జున, వంకిరెడ్డి రెడ్డెప్ప రెడ్డి, కమ్మన్న, టివి రెడ్డి, డా. జూటూరి షరీఫ్, షేక్ రియాజుద్దీన్, గుంటి మురళీకృష్ణ భరద్వాజ్, సోమర రాహుల్, అంకె రామలింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం త్రీ టౌన్ సీఐగా కౌలుట్లయ్య బాధ్యతల స్వీకరణ



జూన్ 6.  అనంతపురం సూర్య : అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా కౌలుట్లయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు నియమించగా, అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

కౌలుట్లయ్య గతంలో శింగనమల సీఐగా విధులు నిర్వహించి, తన సేవలతో గుర్తింపు పొందారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌కు ఆయన ప్రాధాన్యం ఇచ్చినట్లు సహచర అధికారులు పేర్కొంటున్నారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం కౌలుట్లయ్య మాట్లాడుతూ, చట్టాన్ని కచ్చితంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, ఏదైనా సమస్యలు ఉంటే నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది నూతన సీఐకి శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

## శ్రీ చైతన్య స్కూల్‌ను సీజ్ చేయాలి

## విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్ యాదవ్



అనంతపురం, జులై 6 అనంత సూర్య : నిబంధనలకు విరుద్ధంగా రుద్రంపేట బైపాస్ వద్ద నిర్వహిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ సీజ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ నేతలు విద్యార్థులను తరగతి నుంచి బయటికి పంపి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్ యాదవ్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులు జరుగుతుండగానే, మరోపక్క తరగతులు నిర్వహించడం దారుణమన్నారు. వెయ్యి మంది విద్యార్థులు ఉన్నచోట కనీసం మరుగుదొడ్లు, తాగునీరు కూడా లేవని తెలిపారు. చైతన్య విద్యాసంస్థలు యాజమాన్యం ఐపీఎల్, ఐకాన్, ఇలా రకరకాల పేర్లతో రూ. 1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల దాకా ఫీజులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. పుస్తకాల రూపంలో 6వ తరగతి నుంచి నుంచి 10వ తరగతి వరకు 25 వేల నుంచి 30 వేల రూపాయలు వరకు విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. ఇవన్నీ విద్యార్థుల తల్లిదండ్రులు ఆ విద్యాసంస్థకు గుర్తింపు ఉందా ? అక్కడ చదువు చెప్పే టీచర్లు బీఈడీ చేశారా? నోటీస్ బోర్డ్‌లో ఫీజుల వివరాలు ఉన్నాయా ? లేదా ? గుర్తించాలన్నారు. డీఈఓకి ఫోన్లో ఫిర్యాదు చేస్తే.. తాను ఊర్లో లేమని రాగానే శ్రీచైతన్య స్కూల్లో పర్యవేక్షించి గుర్తింపు లేకపోతే, బిల్డింగ్ పూర్తిగా కాకపోతే సీజ్ చేస్తామని తెలిపినట్లు జేఏసీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సతీష్ చౌదరి, జిల్లా నేతలు రాజేష్, ప్రశాంత్, విజయ్, పోలార్డ్ నరేష్, వాల్మీకి కాశీ, గోవర్ధన్, రేవంత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీఎంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలి






అనంతపురం, జులై 6 అనంత సూర్య :విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, అందులో ముఖ్యంగా ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎసఎఫఐ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసఎఫఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, జిల్లా అధ్యక్షులు తరిమెల గిరి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రజిత మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ పథకం అమలు కాక, కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక సతమతమవుతున్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టగానే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలు కూడా చెల్లిస్తామని ఉపన్యాసాలు ఇచ్చి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 7వేల కోట్లకు పైగా ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిల్లో ఉన్నాయని, దీనివల్ల విద్యాసంస్థల్లో ఫీజులు కడితే కానీ సర్టిఫికెట్లు ఇవ్వబోమని చెబుతున్నారన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ పథకాలను దూరం చేయాలనే ఉద్దేశంతోనే ఎఫఆరఎస్ ముఖ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టి కుదించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు మెస్ బిల్లులు పెంచకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, అదేవిధంగా పౌష్టికాహార భోజనం అందలేదన్నారు. విద్యా వ్యవస్థను గాడిన పెట్టాల్సిన విద్యా శాఖ మంత్రి విద్యావ్యవస్థను పట్టించుకుంటున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల ప్రారంభంలోనే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రూ. 7 వేల కోట్ల రూపాయలు ఒకేసారి విడుదల చేయాలన్నారు. అలాగే ముఖ హాజరుపై వెనక్కి తగ్గకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని, భవిష్యత్తులో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. తక్షణమే హాస్టల్లో ఉన్న విద్యార్థులకు మెస్ ఛార్జీలు మూడువేల రూపాయలకు పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎసఎఫఐ జిల్లా నాయకులు సూర్య ప్రకాష్, అరుణ్ రషీద్, వంశి, రాజేష్, గణేష్, సాయి, వంశి, విద్యార్థులు మహేష్, ధరణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానమే... 28 వ సారి రక్తదానం


గుంతకల్ :జులై 7 (అనంత సూర్య) : రక్తహీనతతో బాధపడుతున్న నాగమణి అనే మహిళకు గుంతకల్ కు చెందిన ప్రాణదాత సేవా సమితి రక్తదానం చేయించారు. గుంటకల్ పట్టణ పరిధిలోని ప్రీతి నర్సింగ్ హోమ్ లో సోమవారం నాగమణి అనే పేషంట్ కు ఒ పాజిటివ్ రక్తం అవసరం కాగా ప్రాణదాత సేవా సమితిని



సంప్రదించారు. వెంటనే స్పందించిన సమితి నిర్వాహకులు సభ్యుడు హనుమంతు తో ఒ పాజిటివ్ రక్తం ఇప్పించారు. హనుమంతుకు ఫోన్ కాల్ వెళ్లడంతో వెంటనే స్పందించి పట్టణంలోని గోపి బ్లడ్ బ్యాంక్ కు చేరుకొని రక్తదానం చేశారు. సకాలంలో స్పందించిన రక్తదాతకు ప్రాణదాత సేవా సమితి సభ్యులు, రోగి బంధువులు, బ్లడ్ బ్యాంక్, ఆసుపత్రి సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 సార్లు రక్తదాత తిప్పన్న, హస్సేన,పరశురాం, హనుమంతు, బర్మశాల రఘు, రవిశంకర్, ఆది,రాజు,గఫూర్, మాజీ కౌన్సిలర్ సుమో భాష,ఎ ఎన్ ఎమ్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్షం కోసం గాడిదలకు పెళ్లి...

కర్ణాటక బెళగావి జులై 06 (అనంత సూర్య) : కర్ణాటక రాష్ట్రం వర్షాలు కురవకపోవడంతో కర్ణాటకలోని బెళగావి జిల్లా మూడలగి తాలూకా పరిధిలోని



మున్యాళ గ్రామస్తులు వర్షం కోసం గాడిదలకు వివాహం జరిపించారు. మగ గాడిదకు కాంతేశ్ అని, ఆడ గాడిదకు కస్తూరి అని నామకరణం చేసి హిందూ సాంప్రదాయ బద్దంగా వివాహం జరిపించారు. పెళ్లికి విచ్చేసిన వారికి విందు భోజనం సైతం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, ఇలాంటి పరిస్థితిలో ఆనాదిగా వస్తున్న ఆచారాన్ని దృష్టిలో ఉంచుకొని గాడిదలకు వివాహం జరిపించామన్నారు.

# గత 12 సంవత్సరాలనుండి ఆరోగ్య శ్రీ నిధులపైన న్యాయ విచారణ జరిపించాలి..,

## - పోతుల నాగరాజు విజ్ఞప్తి



అనంత కలెక్టరేట్, జూలై 06:( అనంత సూర్య): జిల్లా కలెక్టర్ కి జిల్లా లోని వివిధ సమస్య లపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం విద్య కు, వైద్యం కోసం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు. ఒక పైపు కార్పొరేట్ విద్యా సంస్థ లు రకరకాల ఫీజుల పేరుతో, పిల్లల యూనిఫామ్ పేరుతో, పిల్లల ప్రయాణం పేరుతో, పుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడి పైన చర్యలు తీసుకో వాలని, పిల్లలు ప్రయాణం చేసే వాహనాలలో ఎలాంటి భద్రత ప్రమాణాలు లేవు, కాలం చెల్లిన వాహనాలు పిల్లల ప్రయాణం కు ఉపయోగిస్తూ, పిల్లల ప్రాణాల తొ చెలగాటం ఆడుతున్నారు. వీటిపై చర్యలు తీసుకొని పిల్లల భవిష్యత్తు ను కాపాడాలి అని, వైద్యం కోసం ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం కార్పొరేట్, ప్రయివేట్ ఆసుపత్రులలో అందించాలని తీసుకొని వచ్చిన ఈ పతకం ఉద్దేశం ను ఈ ప్రయివేట్ కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యం అనేక అవకతవకలకు పాల్పడినట్లు వస్తున్న కథనాల పైన గత 12 సంవత్సరాలనుండి ఖర్చు చేసిన ఆరోగ్య శ్రీ నిధుల పై విచారణ జరిపించాలని కలెక్టర్ కి విన్నపం చేయడం జరిగింది.

ఈరోజు కలెక్టర్ అందుబాటులో లేకపోవడం వలన కలెక్టర్ కార్యాలయ పరిపాలన విభాగం అధికారికి వినతి పత్రం అందచేశాము.

ఈ కార్యక్రమంలో ఞాూ వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు నాయకులు బాషా, చింతన్న, కిష్ట తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ను పకడ్బందీగా చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంత కలెక్టరేట్, జూలై 06: ( అనంత సూర్య): ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, నాయక్ నగర్, రాంనగర్ ప్రాంతాలలోని ఆయా పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పాల్గొని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత హౌసింగ్ బోర్డ్ లో పలు ఇళ్లను సందర్శించి ఓటర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించి ఎస్ఐఆర్ ప్రక్రియలో తమ అర్హతను నిరూపించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ఓటరు జాబితాలో పేరు కొనసాగింపుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారం అందని వారు, అలాగే ఫారం అందినా ఇంకా పూరించి బిఎల్ఓలకు సమర్పించని వారు ఎస్ఐఆర్ ప్రక్రియ పై ఏవైనా సందేహాలు ఉన్న వారు వెంటనే తమ బిఎల్ఓలను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రత్యేక ఓటర్ జాబితా సవరణలో అర్హత కలిగి ఉన్న పౌరుల ఓటు జాబితా నుంచి తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత ఆయా బిఎల్ఓలపై ఉందని, సర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినప్పుడే అర్హత కలిగిన పౌరుల ఓట్లు జాబితా నుంచి పోకుండా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని కుటుంబంలో ఓటర్ల వివరాలు ఒకే చోట నమోదు చేసే ఫ్యామిలీ మ్యాపింగ్ అత్యంత కీలకమని, ఓటర్లకు మరింతగా అవగాహన కల్పించి వారు ఓటు హక్కును నిలుపుకునే విధంగా డిజిటలైజేషన్ నమోదులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

- ఈ ప్రక్రియలో తమ వంతు బాధ్యతగా రాజకీయ పార్టీలు తమ బిఎల్ఏల ద్వారా మరింత చురుకైన సహకారం అందించాలని కోరారు. మరణించిన వారి ఓట్ల తొలగింపు కొత్త ఓట్ల నమోదు మార్పుల కొరకు ఎనుమరేషన్ ఫారాల సేకరణ తదితర అంశాలపై ఆయా బిఎల్ఓలు, బిఎల్ఏలు మరియు ఓటర్లతో జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమయం చాలా తక్కువగా ఉన్నందున బిఎల్ఓలు క్షేత్రస్థాయిలో ఉదయం 6 గంటలకు ఉండాలని, ఎక్కువ పోలింగ్ స్టేషన్లపరిధిలో తక్కువ ఓటర్లు ఉన్నారని, తక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, తిరిగి తీసుకోవడానికి వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈనెల 14వ తేదీలోపు ఈ ప్రక్రియ ఖచ్చితంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

- అంతకుముందు హౌసింగ్ బోర్డ్ లో ఉన్న 26వ వార్డులోని 274 పోలింగ్ కేంద్రం పరిధి, నాయక్ నగర్ 33 వ వార్డులోని 148 ,149, 160 పోలింగ్ కేంద్రం పరిధి, 38వ వార్డు 55వ సచివాలయ పోలింగ్ కేంద్రాల పరిధిలో జిల్లా కలెక్టర్ ఎస్ఐఆర్ ను ర్యాండంగా తనిఖీ చేశారు.

- ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఆయా బిఎల్ఓలు, సూపర్వైజర్లు, బిఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో నాణ్యమైన వరి విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలి...

## వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు డిమాండ్..



పాయకరావుపేట : జులై 06. (అనంత సూర్య) : రైతులకు సకాలంలో నాణ్యమైన వరి విత్తనాలు,ఎరువులు పంపిణీ చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో లవరాజు కు వినతి పత్రం అందజేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించి రైతులకు సేవ చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలు మూసివేశారని, ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటికీ వరి విత్తనాలు 20 శాతం కూడా పంపిణీ కాలేదని, మండల వ్యవసాయ శాఖ అధికారి రైతులకు అందుబాటులో ఉండడం లేదని, ఇన్ పుట్ సబ్సిడీలు లేవని, పంటల నష్టపరిహారం లేదని, వరి విత్తనాలు ఎరువులు లేవని ఆరోపించారు. గత ఏడాది నాణ్యమైన వరి విత్తనాలు పంపిణీ చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఎకరాకు 30 నుండి 35 ధాన్యం బస్తాలు దిగుబడి రావాల్సింది, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయకపోవడం వల్ల ఎకరాకు 20 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులకు సరిపడా, సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చిక్కాల రామారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి సూరకాసుల గోవింద్, జిల్లా కార్యదర్శి పడాల గోవింద్, రైతు విభాగం మండల అధ్యక్షులు కొనె పుత్రరావు, జడ్పీటీసీ లంక సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు గెడ్డమూరి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు ధనిశెట్టి సత్య మహేష్, ఎంపీటీసీ కొంతం నరేష్, ఇసరపు తాతారావు, పన్నీరు పాపారావు, చేపల తాతాజీ, పందిరి ధర్మాజీ, యగదాసు శేఖర్, పల్యాల లక్ష్మణ్ రావు, చిక్కాల సూర్యనారాయణ, యజ్జల సత్యనారాయణ, తిరుమలరాజు నరసింహరాజు, దాడి జగదీష్, వల్లూరి గోవిందరాజులు, త్రిపర్ణ శ్రీను, కర్రి వీరబాబు, తెరపల్లి చంటి, కాకాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ కోసం సప్తగిరి క్యాంఫైర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ. 3 లక్షల సిఎస్ఆర్ విరాళాన్ని అందించడం అభినందనీయం - జిల్లా కలెక్టర్



అనంత సూర్య, అనంతపురం, జులై 06 : అనంతపురం జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ - 2026 కోసం సిఎస్ఆర్ కింద సప్తగిరి క్యాంపైర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మూడు లక్షల రూపాయల విరాళాన్ని అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ - 2026 కోసం సప్తగిరి క్యాంపైర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మూడు లక్షల రూపాయల విరాళానికి సంబంధించిన చెక్ ను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కు సప్తగిరి కర్పూరం ప్రైవేట్ లిమిటెడ్ తరపున సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.మహమ్మద్ హనీఫ్, డిఎస్డీఓ మంజుల అందజేశారు.

- లిఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ - 2026 కోసం సప్తగిరి క్యాంపైర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మూడు లక్షల రూపాయల విరాళం అందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా సప్తగిరి కర్పూరం ప్రైవేట్ లిమిటెడ్ తరపున సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.మహమ్మద్ హనీఫ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ ను విజయవంతంగా నిర్వహించడానికి సప్తగిరి కర్పూరం ప్రైవేట్ లిమిటెడ్ తరపున మూడు లక్షల రూపాయలు సిఎస్ఆర్ నుంచి విరాళంను అందించడం జరిగిందన్నారు. జిల్లాలో క్రీడలను ప్రోత్సహించే మరియు యువ ప్రతిభను ప్రోత్సహించే ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఛాంపియన్‌షిప్ విజయవంతం కావాలని కోరుకుంటున్నామని, ఇది విద్యార్థులకు వారి సామర్థ్యాలను ప్రదర్శించడానికి ఒక అద్భుతమైన వేదికను అందిస్తుందని విశ్వసిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డిఎస్డీఓ మంజుల మాట్లాడుతూ జిల్లా పాఠశాల క్రీడా ఛాంపియన్‌షిప్ కోసం జిందాల్ ఫ్యాక్టరీ వారు రెండు లక్షల రూపాయలు, గుత్తి రెన్యూ ఎనర్జీ వారు రెండు లక్షల రూపాయలు, అయ్యప్ప క్రాకర్స్ వారు 40 వేల రూపాయలు సిఎస్ఆర్ నుంచి విరాళాలను అందించడం జరిగిందని తెలిపారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి – జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం, జులై 06 ( అనంత సూర్య) : విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడడం లక్ష్యంగా విద్యుత్ భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రూపొందించిన "విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలు" పోస్టర్లను ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్ తో కలిసి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యుత్ వినియోగంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యుత్ శాఖ రూపొందించిన ఈ పోస్టర్‌లో పొందుపరిచిన సూచనలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోస్టర్లను ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ/వార్డు సచివాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా రద్దీ ప్రాంతాలు మరియు విద్యుత్ కార్యాలయాల్లో ప్రదర్శించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు పాటించాల్సిన ముఖ్య సూచనలు :

– విద్యుత్ మీటర్ స్విచ్‌లను తడి చేతులతో తాకరాదు.
– పాడైన, తెగిపోయిన విద్యుత్ వైర్లు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
– ఇంటి వైరింగ్‌ను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే చేయించాలి.
– భవన నిర్మాణ పనులు నిర్వహించే సమయంలో విద్యుత్ లైన్లకు సురక్షిత దూరం పాటించాలి.
– ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, ఫీడర్ ప్యానెల్‌లకు అనధికారికంగా ఎవరూ చేరరాదు.
– పిల్లలను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచి, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలి.
– విద్యుత్ తీగలపై బట్టలు ఆరేయడం, యాంటెన్నాలు లేదా ఇనుప వస్తువులు తగిలించడం చేయరాదు.
– విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టకూడదు.
– విద్యుత్ లైన్ల క్రింద వాహనాల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు అత్యంత జాగ్రత్తతో నిర్వహించాలి.
– గృహ విద్యుత్ పరికరాలకు ×ూ× ప్రమాణాలు కలిగిన నాణ్యమైన సామగ్రినే వినియోగించాలి.
– ఫ్రిజ్, ఏసీ, గ్రైండర్, కుక్కర్, ఫ్యాన్ వంటి పరికరాలకు తప్పనిసరిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయాలి.
– విద్యుత్ సరఫరాలో ఏవైనా లోపాలు, ప్రమాదకర పరిస్థితులు గమనించిన వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలి.
– విద్యుత్ సంబంధిత అత్యవసర సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ -- 1912కు ఫోన్ చేయాలని సూచించారు.

# కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంత (అర్బన్), జూలై 07:( అనంత సూర్య ): అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) నందు ఖాళీగా ఉన్న పలు అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫాకల్టీ ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి కె. నాగ రత్న ఒక ప్రకటనలో తెలిపారు.

పోస్టుల వివరాలు – అర్హతలు:

పేరుఖాళీల సంఖ్యకావలసిన అర్హత
1ఫిజిక్స్01. ఎమ్మెస్సీ ఫిజిక్స్
2ూ.ు. (ఫిజియోథెరపీ)01వీూ.ు. / దీూ.ు.
3ూ.ు. (ఆప్తాల్మిక్)01వీ.దీ.దీ.ూ. ఎంబిబిఎస్ / ఎమ్మెస్సీ .
4ఖీ.జి .ఎం . (ఫ్యాషన్ గార్మెంట్ మేకింగ్)01. ఎంఎస్సి (టెక్సటిల్స్ )

పై పోస్టులకు అర్హతలు ప్రకారము అప్లై చేసుకోవాలని కేసర్ గర్ల్స్ కళాశాల ప్రిన్సిపాల్ అమ్మ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగినికి పదోన్నతి



అనంతపురం: అనంతపురం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నాలుగో తరగతి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న లిలిశ్రీమతి దేవరపల్లి స్రవంతిలిలికి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతితో శ్రీమతి స్రవంతి జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆమెకు సహోద్యోగులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

# పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఎస్ఐఆర్ ను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్..



అనంత సూర్య.: అనంతపురం, జులై 06 : ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం నగరంలోని ఆదిమూర్తి నగర్ లోని పోలింగ్ కేంద్రం నంబర్ 135, 137 పరిధిలో, ఉమానగర్ మరియు నీరుగంటి వీధి లోని పోలింగ్ కేంద్రం నంబర్ 203 ఱ 209 పరిధిలో, అరవేటి నగర్ మరియు ఎల్లమ్మ కాలనీ ప్రాంతంలో పోలింగ్ కేంద్రం నంబర్ 237 పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ను జాయింట్ కలెక్టర్ మరియు అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ నోడల్ అధికారి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, మరియు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను సమీక్షించారు. ప్రజలతో మాట్లాడి, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం మరియు ఓటు యొక్క ప్రాముఖ్యత గురించి జాయింట్ కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మరియు నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేలా చూడాలని బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు మరియు ప్రత్యేక అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విషయంలో ఏవైనా లోపాలు, నిర్లక్ష్యం లేదా అశ్రద్ధ కనిపిస్తే తీవ్రంగా పరిగణించబడుతుందని మరియు సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని జెసి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.రామకృష్ణారెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, ఎస్ఈ, ఏఈఆర్ఓలు మరియు ప్రత్యేక అధికారులు, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# ఎమ్మెస్ రాజు సవాలకు" నువ్వు సిద్ధమా ప్రకాష్ రెడ్డి" హిందూపురం అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యలప్ప



అనంత సూర్య , 06: అనంతపురం జిల్లా రాప్తాడు మండల కేంద్రం టిడిపి పార్టీ ఆఫీస్ నందు హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యాలప్ప సోమవారం. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే యం ఎస్ రాజు పై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేను కులవృత్తిపై అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెడ్డి అనే అహంకారంతో దళితులపై దురుసుగా మాట్లాడడం చాలా దారుణం అన్నారు అంతేకాకుండా ఇష్టారాజ్యంగా తప్పుడు సమాచారాలను మీడియాకు అందిస్తూ అసత్యాలను మీడియా ద్వారా ప్రజల పై రుద్దుతూ ఎమ్మెల్యే యం ఎస్ రాజు పై ఇష్ట రాజ్యాంగ వ్యాఖ్యలు చేస్తూ చెప్పుల షాప్ లో పని చేస్తున్నావ్ అనడంపై నోరు హద్దు లో పెట్టుకొని మాట్లాడకపోతే నాలుక తెక్కోస్తాం అన్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే యం ఎస్ రాజు చేసిన సవాల్ కు నువ్వు సిద్ధమేనా యం ఎస్ రాజు ఆస్తులు గురువారం లోపు చూపించకపోతే దళితులు మీ ఇంటిని ముట్టడిస్తే ఎలా ఉంటుందో చూస్తావు అంటూ హెచ్చరించారు.

# నూతన అంగన్వాడీలకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం

- **14మంది అంగన్వాడీలకు నియామక పత్రాలు అందజేత**
- **విద్యుత్ స్టౌవ్ లను అందజేసిన ఎమ్మెల్యే సునీత**
- **కస్తూరిబా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే**





అనంత సూర్య 06: అనంతపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ వర్కర్లు ఆయాలుగా ఎంపికైన 14మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ పోస్టులను ఇటీవల భర్తీ చేశారు. వీరికి రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు నాయకులు పాల్గొన్నారు. అలాగే చెన్నేకొత్తపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలలోని అంగన్వాడీ కేంద్రాలకు 172 ఇండక్షన్ విద్యుత్ స్టవ్ లను ఆయా అంగన్వాడి కేంద్రాల వర్కర్లకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పిల్లలకు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఖర్చు చేస్తున్నాయన్నారు. కొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చిన వారు బాధ్యతగా పని చేయాలన్నారు. ఆహారాన్ని బాగా ఉడికించి.. మీరు రుచి చూసిన తర్వాతనే వారికి అందించాలన్నారు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా అంగన్వాడీ వ్యవస్థకే చెడ్డపేరు వస్తుందన్నారు. పిల్లల్ని తల్లి లాగా లాలిస్తూ.. ఎక్కడా ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

కస్తూరిబా పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

రామగిరి మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని భోజనశాలను, వసతి సౌకర్యాలను పరిశీలించి.. పలు సూచనలు చేశారు. పిల్లలకు వండిన వంటకాలను పరిశీలించి వంటలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థినిలతో సమావేశమై.. భోజన నాణ్యత గురించి ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిల్లలకు సమయానికి భోజన వసతి కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే 1కోటి 25 లక్షల రూపాయల ఎస్.ఎస్.ఏ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనాల పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాలను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని ఆదేశించారు...

# పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి నియామకం



పోరుమామిళ్ల జూలై 6: (అనంత సూర్య ప్రతినిధి) కడప జిల్లా పోరుమామిళ్ల మండలం పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిగా యశ్వంత్ కుమార్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల జిల్లా నుండి డి పి ఆర్ సి ఆఫీస్ నుండి పదోన్నతిపై పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా నియమింపబడ్డారు. ఇక్కడ ఇన్చార్జి కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు డిప్యూటీ ఎండిఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నూతన కార్యదర్శిగా పదవి బాధ్యతలు స్వీకరించిన యశ్వంత్ కుమార్ గారికి శుభాకాంక్షలు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడుపుతానని ఎలాంటి పైరవీలకు తావివ్వకుండా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని యశ్వంత్ కుమార్ తెలియజేశారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని ఆయన చెప్పుకొచ్చారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405